# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 39 సంచిక 12
పేజీలు 44
ఆగస్ట్ 2020

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ............................. ....... పేజీ**

దాశరథీ శతకము ....................4
శ్రీబాబూజీ ఉవాచ.................... 5
అమ్మమాట.................... 8
గుర్వష్టకమ్ ....................11
అమంత్రమక్షరం నాస్తి .................... ....................13
మా ఆశ్రమం - శ్రీకాళీవనాశ్రమం.........16
రామాయణంలో స్త్రీ పాత్రలు....................18
ప్రేమ .................... .................... ....................21
బ్రాహ్మణుడు.......... .................... ....................25
ఎవరు అమరుడు? .... ........ ...... ....................27
జగమెరిగిన స్వామీ ....................29
శ్రీబాబు దివ్యవాణి .................... ....................30
కైవల్యోపనిషత్ ... ....................32
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................34
అత్రి మహర్షి .................... .................... ....................35
శ్రీ మళయాళ స్వామి ....... ....................37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... .................... ....................41

# దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

**శ్రీ రఘురామ చారు తులసీదళ దామ శమక్షమాది శృం**
**గార గుణాభిరామ త్రిజగన్నుత శౌర్య రమాలలామ దు**
**ర్వార కబంధ రాక్షస విరామ జగజ్జన కల్మషార్ణవో**
**త్తారక నామ భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!**

రఘువంశములో పుట్టినవాడవు, సొంపైన తులసీమాలలు గలవాడవు, శాంతి ఓర్మి మొదలగు గుణములచే ఒప్పువాడవు, ముల్లోకముల పొగడదగిన పరాక్రమలక్ష్మికి ఆభరణమైన వాడా! వారింప నలవికాని కబంధుడను రాక్షసుని సంహరించిన వాడా! జనులను పాపములనే సముద్రమును దాటించు నామము కలవాడా! దయకు సముద్రము వంటివాడా! భద్రాచలము నందుండు శ్రీరామా!




*బాబూజీ విశ్వబ్రాహ్మణులు ఎలా అయ్యారు?
*సౌఖ్యోపదేశం అంటే ఏమిటి?
*చంద్రుడిగా పుట్టినది ఎవరు?
*మనసు చేసే చిత్కళలు అంటే ఏమిటి?
*జీవకుడిని చూసి బ్రహ్మమిత్రుడు ఎందుకు బ్రహ్మానందాన్ని పొందాడు?
*చీమలో దోమలో కూడా పరబ్రహ్మాన్ని దర్శించినది ఎవరు?
*మారుతి మూడు నెలల బిడ్డగా ఎందుకు మారాడు?
*స్తబ్ధమైన రామచంద్రుని హృదయాన్ని మేల్కొలిపింది ఎవరు?
*కోట్లాదిమందికి ముక్తి లభించడంకోసం నరకానికి కూడా పోవడానికి సిద్ధపడినదెవరు?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

29-4-80

ఉదయం శ్రీ బాబూజీ వాకింగ్‌లో మాట్లాడుతూ 'నాకు భక్తులతో కాలం గడపటం అంటే ఇష్టం. కొంతమంది అనేక కోర్కెలతో వచ్చి నన్ను బాధిస్తూ ఉంటారు. అయితే ఈ బాబు సాక్షిగానే ఉండిపోతాడుగాని, వారి విషయాలలోకి పోడు. చాలామంది నేను గొప్పవాడిని, అన్ని విషయాలు నాకే తెలుసు, నా అంత జ్ఞానిలేడు అనికూడా అనుకుంటారు. అదంతా మిథ్య. ఈ భావన అంతా ఉపాధి ఉన్నంతవరకే. శరీరాన్ని వదిలిన తర్వాత ఏముంది?



ఒక వ్యక్తి పెన్నుతో మంచివ్యాసం వ్రాస్తాడనుకోండి, ఆ వ్యాసం యొక్క ఔన్నత్యం ఆ వ్యక్తిదా? లేక ఆ పెన్నుదా? లేక ఆ ఇద్దరిని ప్రకాశింపజేసే పరమాత్మదా? ఒక డాక్టరు ఉన్నాడనుకోండి. ఆయన వ్యాధిని నయం చేస్తాడు, ఆ గొప్పతనం ఔషధానిదా? లేక డాక్టరుదా?

అందరిని ప్రకాశింపజేస్తూ తాను స్వయంగా ప్రకాశించే ఆ తారక బ్రహ్మాన్ని విస్మరించి, అందరూ మేమే గొప్పవాళ్లము అనుకుంటారు. విద్యుత్తు రాగితీగెలో ప్రవహిస్తూ ఆ తీగెకు శక్తినిస్తుంది. అయితే విద్యుత్తు కనపడుతుందా? అలాగే రేడియోకి శక్తినిచ్చే బ్యాటరీలో శక్తి కనపడుతుందా? అలాగని ఆ శక్తిని లేదంటామా? మూర్ఖులు దేవుడు లేడంటారు. పరమాత్మ శక్తిని చూస్తూనే ఆ శక్తిని లేదనటం అవివేకం కాదా? భక్తి ద్వారా ఉద్భవించే శక్తి చాలా గొప్పది. ఆ దివ్యశక్తితో పరమాత్మని సైతం మన హృదయంలో శాశ్వతంగా బంధించవచ్చు. శాస్త్రజ్ఞుడు తన శాస్త్ర విజ్ఞానాన్ని అంతా వినియోగించి, చంద్రమండలంపైకి వెళ్ళి ఒక గుప్పెడు మట్టి తేవటానికి ఎంతో శ్రమించాలి. అదే జ్ఞాని అయితే

చంద్రమండలంగాని, మరి ఏ ఇతరగోళం మీదికిగాని ఒక్కక్షణంలో పోగలుగుతాడు. భక్తి ద్వారా, జ్ఞానం ద్వారా ఉద్భవించే శక్తిని ఎవరు అంచనా వేయగలరు?

భక్తిని చెప్పుకోవలసివస్తే మనము జితేంద్రియుడిని చెప్పుకోవచ్చు. 14సం॥ అరణ్యవాసం చేసిన పిమ్మట సీతాసమేతంగా అయోధ్యచేరిన శ్రీరామచంద్రుడు ఆ జగజ్జననితో మనసారా ముచ్చటిద్దామనుకుంటాడు. కాని మారుతి, రాముని పాదసేవలో నిమగ్నమై, తన అపార భక్తితో శ్రీరామచంద్రుడిని తన హృదయంలో బంధిస్తాడు. సీతమ్మతల్లి శ్రీరామచంద్రునితో ముచ్చటించటానికి తహతహలాడుతుంది. అయితే మారుతి అందుకు అవకాశం ఇవ్వటంలేదు. పాదసేవలోనే నిమగ్నమై ఉన్నాడు.

శ్రీరామచంద్రుడు మారుతి మనస్సు మళ్లించటానికి 'నాయనా! 14 సం॥ల అనంతరం నేనూ సీతాదేవి కలుసుకున్నాము' అంటాడు. 'అయితే ఏమిటి రామచంద్రా?' అంటాడు మారుతి. 'నాయనా! మారుతీ నాకు దాహం వేస్తున్నది. ఆ దాహం తీరటానికి మానస సరోవరంలో నీరు పట్టుకురా నాయనా!' అంటాడు శ్రీరామచంద్రుడు. ఈ విధంగానైనా జితేంద్రియుని మనసు మళ్లించటానికి. అయితే జితేంద్రియుడు తోకరాయుడుకదా! ఒక్కక్షణంలో మానస సరోవరంలోని నీటిని ఒక పాత్రలో తీసుకొని, దానిని ఒక కమలంతో కప్పి తీసుకువచ్చి ఇస్తాడు. కాని తాను మాత్రం స్వామి పాదసేవలో నిమగ్నమై ఆపాదసేవలోని అమృతాన్ని గ్రోలుతూ ఆనందాన్ని పొందుతూ ఉంటాడు.

శ్రీరామచంద్రుడు తిరిగి మారుతికి పరీక్ష పెడతాడు. 'నాయనా! మారుతీ! నీకు మేము జననీ జనకులం కాబట్టి, 6 నెలలు దాటిన బిడ్డ మా వద్ద ఉండరాదు' అంటాడు శ్రీరామచంద్రుడు. 'అలాగే స్వామీ!' అని మారుతి వెంటనే 3 నెలల బిడ్డగా త్రిగుణములను వదలి సత్య శివ సుందర రూపుడుగా ప్రకాశిస్తాడు. ఇప్పుడు మారుతికి ఇంకా స్వామి సేవ ఎక్కువగా చేయటానికి అవకాశం వచ్చింది. శ్రీరామచంద్రుడు 'నాయనా మారుతీ! మామూలు రూపాన్ని ధరించ'మంటాడు. తిరిగి మారుతి తన సహజ రూపాన్ని ధరించి స్వామి పాదసేవలో

నిమగ్నమవుతాడు.

మూడవ పర్యాయం శ్రీరామచంద్రుడు మారుతిని 'నాయనా! నువ్వు ఆ ప్రహరీగోడ అవతల ఉండు, నేను జననితో రహస్యంగా మాట్లాడాలి' అంటాడు. దానికి మారుతి 'సరే స్వామీ! కాని ఒక షరతు. నేను రామనామ స్మరణ చేసినపుడు మాత్రం పలికితే చాలు' అంటాడు. శ్రీరామచంద్రుడు భక్తవత్సలుడు కాబట్టి దానికి అంగీకరిస్తాడు. మారుతి ప్రహరీగోడకు తలచేర్చి రామనామస్మరణ చేస్తూ ఉంటాడు. ఆ నామస్మరణలో కాలాన్ని పెంచేస్తాడు. శ్రీరామచంద్రుడు 'ఆఁ' అని పలికి నోరు తెరచి అలాగే ఉండిపోతాడు.

జనని ఈ దురవస్థను చూసి వశిష్ఠుల వారికి నివేదిస్తుంది. ఆయన 'నేనేమి చేయలే' నని సమాధానమిస్తాడు. మారుతి తన్మయత్వంలో ఉంటాడు. లక్ష్మణుడుగాని ఇతర వానరులుగాని నిస్సహాయస్థితిలో ఉంటారు. మారుతి యొక్క భక్తి పారవశ్యాన్ని దేవతలంతా చూస్తూనే ఉన్నారు. నారదుడు శ్రీరామచంద్రుని వద్దకువచ్చి 'దీనికంతకు కారకుడైన మారుతి ఒక్కడే ప్రభువుకి కలిగిన బాధ నివృత్తిచేయాలి తప్ప, ఇతరులెవ్వరూ ఏమీ చేయజాలరు' అని చెప్తాడు.

మారుతిని సమీపించటానికి అందరూ భయపడతారు. లక్ష్మణుడు, వానరులు అందరూ మారుతియొక్క భక్తి పారవశ్యంలో లీనమై, వారుకూడా మారుతితోపాటు గానం, నృత్యం చేస్తూ, తన్మయత్వం పొందుతారు. తన్మయత్వంలో మారుతి యొక్క ప్రకాశం వర్ణింపశక్యం కాదు. తన అచంచల భక్తితో ప్రభువుని తన హృదయంలో బంధించాడు. అది విడదీయరాని బంధం. భక్తివలన ఉద్భవించిన శక్తిని ఎవరు ఆపగలరు? చివరకు నారదుడు మారుతి వద్దకు వెళ్ళి 'స్వామికి బ్రహ్మపిశాచి పట్టింది' అంటాడు. అది విన్న మారుతి నా ప్రభువుకి వచ్చిన ఆపద ఏమిటి? పిశాచం ఏది ఎక్కడ?' అనేసరికి, శ్రీరామచంద్రుడు యథాస్థితికి వచ్చి, 'మారుతీ! నాయనా నువ్వు ఇక్కడే కూర్చొని పాదసేవ చేసుకో' అంటాడు. చూశారా! భక్తిలో ఎంత శక్తి ఉందో! దానిని ఎవరైనా అంచనా వేయగలరా?' అన్నారు శ్రీ బాబు.

# అమ్మమాట

- రమణ ప్రసాద్

## పాదసేవనం

మనం నవవిధ భక్తుల గురించి చెప్పుకొంటున్నాం. **"శ్రవణం, కీర్తనం, విష్ణోః స్మరణమ్, పాద సేవనం"** మొదటి మూడు విధముల భక్తిని గురించి చెప్పుకొన్నాం. మన సత్సంగాలలో నాల్గవదైన "పాద సేవనం" గురించి ఈ రోజు తెలుసుకొందాం. పాద సేవ అంటే పదములను అర్చించుట. ఆలయంలోకి వెళ్ళి అర్చకులవారిని, 'స్వామీ! పాదుకలను(శఠగోపం అంటారు) ఇస్తారా?' అంటే ఆయన స్వామి పాదములను మన శిరస్సున పెడతారు. రెండవది - 'పదములు' అంటే మహాత్ముల వాక్కులు. వారి ముఖస్తుగా వచ్చినవి. అవే భగవద్గీత, యోగవాశిష్టం మొదలైనవి. ఆ పదముల యందు మనస్సును ఏకాగ్రత చేసి శ్రద్ధగా వింటే, మనకు ఆచరణ యోగ్యత వస్తుంది. **శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేన్ద్రియః** (భ.గీ.4/39). ఆ పదముల యందు శ్రద్ధ కలిగి వుంటే ప్రతి అణువులో ప్రకాశించే పదములను గుర్తిస్తాం. భగవంతుడు లేని అణువు లేదు. పరమాత్ముడు ఈ జగత్తును సృష్టించి, ఆయనను గుర్తించే అవకాశం మనకు ఇచ్చాడు.



ఆంజనేయ స్వామి శ్రీ రామ చంద్రుని ప్రధమ దర్శనంలోనే ఆయన పాదాలను గట్టిగా పట్టుకొన్నాడు. "నా ప్రభువు వస్తాడు, నన్ను తరింపజేస్తాడు అని ఎదురు చూశాడు. ఆ సమయం రానే వచ్చింది. మనంకూడా అలా ఎదురు చూడాలి. అప్పుడు భగవంతుడు గురురూపంలో వచ్చి, తమ వాక్కుల ద్వారా, చేతల ద్వారా అనుగ్రహించి, "ఈ ప్రపంచం నుంచి భయపడకు" అని ధైర్యాన్ని ఇస్తారు. ఆలోచించండి! మనం ఆ పాదాలను పట్టుకోలేదా? పట్టుకొనే ఉన్నాం. పట్టుకోకపోతే పట్టుకోండి. భగవంతుడిని భావనతో బంధిస్తే భవం (పుట్టుక) నుండి తరిస్తాడు మానవుడు. నీలో వచ్చే భావాలను సద్భావాలుగా మార్చుకో.

భగవంతుని పాదాలను అర్చించు.

**త్వత్పాదాంబుజ మర్చయామి పరమం, త్వాం చింతయామ్యన్వహం,**
**త్వామీశం శరణం వ్రజామి వచసా త్వామేవ యాచే విభో.**
**వీక్షామే దిశ చాక్షుషీం స కరుణాం దివ్యై శ్చిరం ప్రార్థితాం**
**శంభో లోకగురో మదీయ మనసస్సౌఖ్యోపదేశం కురు.**

శ్రీ శంకరులు పార్వతీ వల్లభుని ప్రార్థిస్తున్నారు: "ఓ పార్వతీ వల్లభా! ఎల్లప్పుడూ సర్వోత్కృష్టమైన నీ పాదములను అర్చించుచూ నీవే దిక్కు అని శరణు వేడినాను; దేవతలు సహితం నీ కృపాదృష్టికై ఎదురు చూస్తూ ఉంటారు. అట్టి కరుణా రసమును నాపై ప్రసరింపజెయ్యి. ఈ జనన మరణ రూపమైన సంసారాన్నుండి కాపాడి నా మనస్సుకు శాంతి కలిగేటట్లు సౌఖ్యోపదేశం(బ్రహ్మోపదేశం) చెయ్యి ప్రభూ!" అని. ప్రపంచంలో అన్నీ మారిపోయేవే. నన్ను కరుణించి ఆత్మోపదేశాన్ని చేసి నాకు శాంతిని ప్రసాదించమని కోరుకున్నాడు.

మనం సమర్థులైన గురువుల అనుగ్రహ కిరణాలలో ఉన్నాం. తనను తాను గుర్తించే వరాన్ని పొంది ఉన్నాం. ఆ గురుపాద సన్నిధి ఎటువంటిది? గురితప్పని నిజ దృష్టికి గురుతు "తాను" అని తెలిపేది. ఈ జీవితం ఉండగానే అట్టి జ్ఞానాన్ని పొందాలి. ఇది (జీవితం) జారిపోతే చివరికి మిగిలేది ఎత్తిపోతలే. ఇంకా గురుపాదం ఏమని చెబుతోంది? "ఈ జపములు తపములు సాధనలు ఎందుకు? సతతము నను మదిలో నిలిపితే చాలు పో!" ఏపని చేస్తున్నా నన్ను మదిలో నిలుపుకో. ఇంక ఇతర సాధనలతో పని లేదు. అయితే దీనికి పథ్యం ఉంది. "చెప్పుడు మాటలు విని చెడిపోకు. సాధనలో దిగజారకు. కులశైలాలు పైనబడినా ఉప్పెనలే వచ్చినా చలించకుండా ఉండాలి. అట్టివాడే నిజమైన భక్తుడు." అని.

సాధనలో చాలా సందేహాలు వస్తాయి. పట్టు వీడకుండా సాధన చెయ్యి. వినయ విధేయతలతో సద్గురువుల చెంతకు చేరి నీ సందేహాలను తీర్చుకో.

ఒకసారి బ్రహ్మ మానస పుత్రులైన సనక సనందన సనత్కుమార, సనత్సుజాతులు తమకు కలిగిన సందేహాలను తీర్చుకోవటంకోసం బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల వద్దకు వెళ్తారు. వారు తమ సతులతో కూడి వుండటం

చూసి, "వీరు మన సందేహాలు తీర్చలేర'ని ముందుకు సాగిపోతుంటే, శివుడు దక్షిణముఖంగా కూర్చుని వారికి దర్శమిచ్చాడు. అందుకే ఆయనను దక్షిణామూర్తి అని పిలుస్తారు. ఆయన చిన్ముద్రలో మౌనంగా కూర్చుంటే వీరి సందేహాలన్నీ తీరిపోయాయి.

**నానా ఛిద్ర ఘటోదరస్థిత మహాదీప ప్రభా భాస్వరం,**
**జ్ఞానం యస్యతు చక్షురాది కరణ ద్వారా బహిస్పందతే।**
**జానామీతి తమేవ భాంత మనుభా త్యేతత్సమస్తం జగత్**
**తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షణామూర్తయే॥**

- దక్షిణామూర్తి స్తోత్రం

ఏముంది ఈ దేహంలో? "ఏ విధంగా రకరకాలైన చిల్లుల కుండలో ఒక దీపం పెడితే, ఆ దీపంలోనుంచి వచ్చే కాంతి ఆ చిల్లుల ఆకారంలో ఉంటుందో, అదే విధంగా చైతన్యం కళ్ళు, చెవులు మొదలైన ఇంద్రియాల ద్వారా ప్రకాశిస్తోంది. ఏ చైతన్యం వలన, ఈ వస్తుమయమైన ప్రపంచం తెలియబడుతోందో, అటువంటి దివ్యమూర్తి, సద్గురువు అయిన శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా ప్రణామములు." అని ఈ శ్లోకం అర్థం. ఈ చైతన్యాన్ని "ప్రజ్ఞ" అని కూడా అంటారు. ఈ ప్రజ్ఞ మన లోపల ఉండి నడిపిస్తున్నది. అది లేకపోతే ఎత్తిపోతలే.

సమర్థులైన గురువులు అట్టి స్థితిని తాము పొంది తమను ఆశ్రయించిన వారికి అట్టి అనుభూతిని పొందజేస్తారు. కాబట్టి అట్టి ధృడాఉ పరోక్ష జ్ఞానానుభవాన్ని మనందరికీ కలుగజేయమని శ్రీ గురుదేవులను ప్రార్థిస్తున్నాను.

## చందాదారులకు విజ్ఞప్తి

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించు కొనవలసినదిగా విజ్ఞప్తి.

# గుర్వష్టకమ్

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీప్రసాద్ (అమెరికా)

**అనర్ఘ్యాని రత్నాని ముక్తాని సమ్యక్**

**సమాలింగితా కామినీ యామినీషు।**

**గురోరంఘ్రి పద్మే మనశ్చే న లగ్నం**

**తతః కిమ్ తతః కిమ్ తతః కిమ్ తతః కిమ్॥**

అమూల్యమైన మణులు, రత్నాలు, వజ్ర వైఢూర్యాలు చెంతనే వున్నప్పటికీ, సదా వెనువెంటనే వుండి, అంటిపెట్టుకునే భార్య వున్నప్పటికీ, గురుపాద పద్మముల యందు మనస్సు లగ్నం చేయలేనప్పుడు అది వ్యర్థమే - అన్నది ఈ శ్లోక తాత్పర్యము. నిజానికి ఈ శ్లోకం తొమ్మిదవది అవుతుంది. కొన్ని ఆధారాల ప్రకారం మునుపటి శ్లోకమే (అరణ్యే నవా స్వస్య గేహే న కార్యే) చివరిదిగా చెప్పబడింది. యదార్థ ప్రమాణము ఏమై వుంటుదన్న విశ్లేషణము ప్రక్కన పెట్టి పరిశీలిస్తే పైకి సాధారణంగా కనిపించే ఈ శ్లోకంలో సాధకుడికి పనికి వచ్చే అనర్ఘ్యమైన (అమూల్యమైన) విషయాలు అనేకం వున్నాయి.

**అనర్ఘ్యాని రత్నాని ముక్తాని సమ్యక్ -**

ఒక సాధన పరిణామ క్రమంతో పరిశీలించినప్పుడు ముందు శ్లోకంలో చెప్పబడినట్లు సాధకుడు యమ నియమాదులతో ఆసన శుద్ధి కలిగి గురుధ్యానానికి ఉపక్రమిస్తాడు. అలా ఉపక్రమించిన తక్షణమే మనసు దానంతటది లగ్నమవడం చాలా కష్టతరమైన విషయం. దీనినే గీతాచార్యులు ధ్యానయోగంలో **'అసంశయం మహాబాహో! మనో దుర్నిగ్రహం చలం'** అంటూ 'అతి చంచలమైన మనస్సును నిగ్రహించడం నిస్సందేహంగా కష్టమే' అని శెలవిచ్చారు.

అలాంటి మనస్సు తన కిష్టమైన భోగభాగ్యాల మీద మరలడం సహజం. మరి దానిని అధిగమించడం ఎలా అన్నది కూడా గీతాచార్యులే **'అభ్యాసే నతు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే'** అంటూ కేవలం అభ్యాస వైరాగ్యముల చేతనే మనసుని నియంత్రించ వచ్చని శెలవిచ్చారు.

మనస్సు సంకల్ప వికల్పముల సంఘాతముగా చెప్పబడింది. అంటే నిరంతరమూ ఒక విషయాన్ని వదలి, మరొక విషయాన్ని

పట్టుకుంటుంది. అయితే ఇది ఒక కొమ్మను వదలి మరొక కొమ్మను పట్టుకునే కోతి వలె, ఒక విషయాన్ని వదిలే ముందు దానికంటే విలువైనదిగా అనిపించిన మరొక విషయాన్ని పట్టుకుంటుంది.

రత్నాలు వజ్రవైఢూర్యాలు దొరికినప్పుడు ఎక్కువ విలువైన వాటిని గ్రహించి, తక్కువ విలువగా అనిపించిన మిగితా వాటిని వదిలివేస్తుంది. అలాంటి రత్నాల కంటే విలువైన, అమూల్యమైన పరమాత్మవస్తువు యొక్క మాధుర్యాన్ని తెలుసుకున్నప్పుడుగానీ, వాటి నుండి మనస్సు మరలదు. అదే విషయాన్ని 'సమ్యక్' అన్న శబ్ద ప్రయోగంతో శంకరులు వివరించారు. సాధకుడికి అవరోధం కలిగించే విషయాదులనే శ్రీబాబూజీ 'మనసు చేసే చిత్కళలు'గా సూచించారు. సాధకుడు వీటిని అధిగమించి నిలద్రొక్కుకున్నప్పుడు మాత్రమే ధ్యానం కుదురుతుంది. అది కేవలం అభ్యాస వైరాగ్యాల ద్వారానే సాధ్యమవుతుంది.

**సమాలింగితా కామినీ యామినీషు** - 'కామినీ' అన్న శబ్దము కోరిక, లేక సంకల్పాన్ని సూచిస్తుంది. సాంఖ్యయోగములో గీతాచార్యులు కోరిక యొక్క పరిణామ క్రమాన్ని వివరిస్తూ 'ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూప జాయతే। సంగాత్ సంజాయతే కామః। కామాత్ క్రోధోభి జాయతే' - అంటూ ఒక విషయాన్ని చింతన చేస్తూ వుండటం వలన దానితో సంగం ఏర్పడి కామము (కోరిక)గా మారుతుంది అని బోధించారు. అదే కోరిక తీరని పక్షంలో క్రోధముగా, సమ్మోహముగా మారి చివరకు బుద్ధి వినాశానికి దారితీస్తుంది.

'యామిని' అంటే చీకటి అని అర్థం. చీకటి అజ్ఞానానికి సంకేతం. బాహ్య ప్రపంచంలో మానవుడు అజ్ఞానంతో ఆవరింపబడి, అపరిమితమైన కోరికలతో చైతన్య స్వరూపుడైన పరమాత్మను దర్శించలేక పోతాడు. అప్పుడు భగవంతుడే సాక్షాత్ గురురూపాన్ని స్వీకరించి, 'అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా' అని చెప్పబడినట్లుగా అజ్ఞానాన్ని పటాపంచలుచేసి, జ్ఞాననేత్రాన్ని ప్రసాదిస్తాడు. అందుకు తగిన పాత్రతను పొందడానికి సాధకుడు తన ధ్యాసను విషయాదుల నుండి గురుబోధవైపు మళ్ళించవలసి వుంటుంది. ఆ ధ్యాస (చింతన) ద్వారా కలిగిన సంగము సత్సంగమై గురుపాద పద్మములపై లగ్నచిత్తుడై సాధకుడు తరిస్తాడని ఈ శ్లోకము యొక్క అంతరార్థము. -సశేషం

# అమంత్రమక్షరంనాస్తి

సేకరణ- బొంబాయి కృష్ణారావు

పూర్వం బ్రహ్మా మిత్రుడు అనే గురువుకు పదిమంది శిష్యులుండేవారు. ఈ పదిమందికి ఆయన పది సంవత్సరాలు వైద్యవిద్య నేర్పించారు. చివరిలో ఒక పరీక్ష పెట్టారు. ఆ విద్యార్థులందరినీ పిలచి, 'మీరు అరణ్యానికి వెళ్ళి ఏ మందుకూ పనికిరాని ఆకులు తెచ్చి నాకు చూపించండి' అన్నారు. పనికి వచ్చే ఆకులు తెమ్మంటే కష్టంగాని, పనికిరాని ఆకులు తెమ్మంటే కష్టమేముంది? వెంటనే అందరూ కలసి బయలుదేరి వెళ్ళారు.

వెళ్ళినవారిలో రెండెడ్లబండి తీసుకు వెళ్ళిన విద్యార్థి ముందుగా తిరిగి వచ్చాడు. మట్టి ట్రాక్టరులో వేసినట్లుగా ఆకులన్నీ గుత్తుగా బండిలో వేసి నింపేశాడు. 'ఇవన్నీ పవికి రానివే' అని గురువుగారికి చూపించాడు. ఆయన నవ్వుకున్నారు. తరువాత సంచి తీసుకువెళ్ళినవాడు, రెండు జేబుల విద్యార్థి... ... ఇలా తొమ్మిదిమంది కూడా ఒక్కొక్కళ్ళు వారికి తోచిన ఆకులు కాసిని వేసుకుని వచ్చి గురువుగారికి చూపించారు.

ఆఖరుకు పదవ విద్యార్థి కూడా వచ్చాడు. అతని పేరు జీవకుడు. అతని ముఖం చిన్నబోయి వున్నది. గురువుగారు 'ఏం నాయనా! అలా వున్నావేమి? నీవేమీ తీసుకుని రాలేదా?' అని అడిగారు. జీవకుడు 'గురుదేవా! నేను ఎంత వెదకినా నాకు వైద్యానికి పనికిరాని ఆకు ఒక్కటి కూడా కనబడలేదు' అన్నాడు. 'అదేమిటి! నీవు వీరందరికంటే తెలివైనవాడివా?' అన్నారు గురువుగారు.

'అదికాదు. గురుదేవా! మీరు నాకు వైద్య విద్య నేర్పడం ప్రారంభించినప్పుడే ఒక శ్లోకం నేర్పారు. దాని ప్రకారం ఈ ప్రకృతిలో పనికిరానిది ఏదీ లేదని చెప్పారు' అన్నాడు. 'ఏమిటా శ్లోకం?' అని గురువుగారు అడిగారు. **అమంత్రమక్షరం నాస్తి। నాస్తి మూలం అనౌషధం। అయోగ్యః పురుషో నాస్తి। ప్రయోగః తత్ర దుర్లభః॥** .... .... అని జీవకుడు సమాధానమిచ్చాడు. దాని అర్థమేమంటే....

**అమంత్రమక్షరం నాస్తి** - అంటే ఏ భాషలో కూడా మంత్రం కాని అక్షరం లేదు. సంస్కృతంలో 50 అక్షరాలు., తెలుగులో 56 అక్షరాలు వుంటాయి.

వీటిలో మంత్రానికి పనికిరాని అక్షరం లేదు. ఏ అక్షరం దేనికి బీజాక్షరం అనేదానిలో భేదాలు వుంటాయి. అన్ని అక్షరాలు బీజాక్షరాలే. అలాగే, **నాస్తి మూలం అనౌషధం** - వైద్యానికి పనికిరాని ఆకు కూడా ప్రపంచంలో లేదు. అలాగే, **అయోగ్యః పురుషోనాస్తి** - పనికిరాని మనిషి కూడా ప్రపంచంలో లేడు (ఇక్కడ పురుషః అంటే మనిషి అని అర్థం. ఆడ లేదా మగ ఎవరైనా సరే). ఇహ చివరి వాక్యం **ప్రయోగః తత్ర దుర్లభః** - ఏ విషయం గురించి అయినా సరే ముందు ప్రయోగం చేసి చూడాలి. అంతేకాని 'అది బాగోదు' అని ముందే తీర్మానించరాదు.

'ఈ శ్లోకాన్ని మీరు నాకు ఉపదేశించారు గురుదేవా! అందుకే నేను ప్రయత్నం చేశాను. మీరు చెప్పినట్లుగా నాకు పనికిరాని ఆకు దొరకలేదు' అన్నాడు జీవకుడు. వెంటనే గురువుగారు అతనికి క్రాస్ ఎగ్జామినేషన్ పెట్టారు. మిగతావారంతా పనికిరావంటూ తెచ్చిన ఆకులు చూపించి, 'ఇవి వేటికి పనికి వస్తాయో చెప్పు' అన్నారు.

వెంటనే జీవకుడు 'ఇవిగో! ఇవి మారేడు ఆకులు. తేమ, నీటి తడి వున్నచోట ఈ ఆకులు వేస్తే తేమను లాగేస్తాయి. అలాగే ఇది వుత్తరేణి ఆకు. పళ్ళు తోముకోవడానికి ఉపయోగిస్తాయి. మరొక ఆకును చూపించి ఇది అతిసారాన్ని తగ్గించడానికి పనికివస్తుంది. అంటూ ..... ... ఇలా అక్కడ వున్న ఆకుల పేర్లు, అవి ఎందుకు ఉపయోగ పడతాయో వివరించి చెప్పాడు. గురువు బ్రహ్మ మిత్రుడు బ్రహ్మానందాన్ని పొందాడు తన శిష్యుడు జీవకుడిని చూసి. ఆ తరువాత కాలంలో ఆ జీవకుడు ఆయుర్వేద ఔషధాల తయారీలో ప్రసిద్ధి పొందాడు.

అలాగే, 'ప్రతి మనిషి ఏదో ఒకదానికి పనికి వస్తాడు. పనికిరాని మనిషి ఈ ప్రపంచంలో లేడు' అని తీర్మానించుకుని, ప్రతి విద్యార్థిని వుపాధ్యాయుడు తీర్చి దిద్దాలి. కొందరు ఆటలకు, కొందరు పాటలకు, మరి కొందరు రచయితగానో, కావ్యకర్తగానో ఏదో ఒక రంగంలో పనికొస్తారు. విద్యార్థికి చదువు చెబుతూనే అతను ఏ రంగంలో ఎదగగలడో గుర్తించి, ఆ విషయం ఆ విద్యార్థికి చెప్పి, ప్రోత్సహించాలి. ఇది ఉపాధ్యాయుని విధి.

ఇవాళ్టి పరిస్థితి ఇలా లేక, మూసపోసినట్లుగా ఒకేలా ఉంది. అందరూ ఇంగ్లీషు మీడియం చదవాలి; అందరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

అవ్వాలి; అందరూ అమెరికా ప్రయాణం చెయ్యాలి అంటూ. దాని వల్ల మిగతా రంగాలలో మనుష్యులు దొరక్క, కొన్ని రంగాలలోనే డిమాండ్ ఎక్కువై, అందరి అవకాశాలు దెబ్బతింటున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం మన శాస్త్రాలు సూచించిన ఈ బ్రహ్మమిత్రుడి కథ 'అమంత్రమక్షరం నాస్తి'. ఉపాధ్యాయులు దీనిని అవగాహన చేసుకుని, ప్రతి విద్యార్థినీ ప్రోత్సహించాలి. 'ఇది రాకపోతే పోయిందిలే, కంగారు పడకు, ఇలాంటి మరెన్నో పనులు వున్నాయి' అని ధైర్యం చెప్పాలి. వెంటనే అతడికి ఉత్సాహం వస్తుంది. ఆ ప్రోత్సాహం లేకపోతే విద్యార్థి ఫెయిల్ అయిన మరుక్షణం ఆత్మహత్యకు పాల్పడుతున్నాడు. అందుకే విద్యా రంగంలో మార్పు ప్రారంభం కావాలి.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**ఆగస్ట్ 2020**

3 సోమ -రాఖీ-జంధ్యాలపౌర్ణమి-సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

11 మంగళ-శ్రీకృష్ణాష్టమి-సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

13 గురు - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

22 శని - వినాయక చవితి - ఉ॥ 11 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

**సెప్టెంబర్ 2020**

2 బుధ - భాద్రపద పౌర్ణమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

12శని-శ్రీగురుదశమి-సా॥5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# మా ఆశ్రమము - శ్రీకాళీవనాశ్రమము

- గోనుగుంట్ల శైలజ

మా ఆశ్రమము చాలా విశిష్ఠమైనది. ఎందుకంటే చాలా ఆశ్రమాలు బ్రహ్మాచారులు, సన్యాసులచే నడుప బడుతున్నాయి. కానీ, మా ఆశ్రమం విశిష్ఠమైన రీతిలో గృహస్థులే సన్యాసులుగా మెలుగుతూ, అతిథి మర్యాదలతో పాటుగా రకరకాల సేవ చేస్తూ, భగవంతుని సేవయే పరమావధిగా తలుస్తూ, ఆశ్రమ సేవ చేస్తూ, ఏ మాలిన్యాలూ అంటకుండ వ్రేపల్లెలోని గోపికలవలే వున్నారు.

మా గురుదేవులు 'శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ'. ఈనాడు ఆయన భౌతికంగా లేరు. కానీ, ఆయన భౌతికంగా వున్నప్పుడు మా ఆశ్రమంలో కార్యక్రమాలు ఎలా జరిగేవో, ఇప్పుడూ అలాగే యథావిధిగా జరుగుతున్నాయి. ఏ విధమైన తేడా లేదు.

మా ఆశ్రమము నంబూరు కాకానిల మధ్యలో వున్నది. నంబూరు రైల్వేస్టేషన్ ఎదురుగా పెద్ద ఆర్చ్ వుంటుంది. దానిమీద శ్రీకాళీగార్డెన్స్, శ్రీరామానంద ద్వారము అని వ్రాసి వుంటుంది. దానికి ఇరువైపుల ఒక ప్రక్క రేడియో స్టేషన్, మరొక ప్రక్క ఫుడ్ కార్పోరేషన్‌వారి గోడౌన్స్ వుంటాయి. ఆశ్రమం ఆర్చిలో నుండి లోపలికి వెడుతున్నప్పుడు దారికి ఇరువైపులా రండి రండి అని ఆహ్వానిస్తున్నట్లుగా వచ్చే భక్తులకు చల్లని గాలినిస్తూ, తమ చిన్నారి కొమ్మలతో చెట్లు వుంటాయి. అవి స్వామివారి అవతారకాలంలో ఆశ్రమ భక్తులచేత స్వయంగా నాటించారు. అందుకే అవి అంత వినయ భయభక్తులతో ఆహ్వానిస్తున్నాయి!

కొంత దూరం వెళ్ళాక కుడిచేతి వైపు పెద్ద కట్టడం కనిపిస్తుంది. అది రోగులను దరిచేర్చుకుని, వారి శారీరక రోగాలను తగ్గించే వైద్యశాల. దానిని నిర్వహించే వైద్యులు కూడా గురుదేవులకు ఎన్నో సంవత్సరాల నుండి చాలా సన్నిహితంగా మెలగినవారే. వారు 1. డా॥ అశోక్ - ఈయన పేరులోని ప్రత్యేకత శోకము లేనివాడని అర్థం. చిన్నపిల్లల శోకాలను మాన్పించి, వారి రోగాలను నయం చేసే గొప్ప పిల్లల వైద్య నిపుణుడు. వీరు భగవంతుని సేవకు అంకితమై, తన వృత్తితో పాటుగా సంగీత, సంస్కృతాలు కూడా నేర్చుకుని పర్వదినాలలో గంభీర

వుపన్యాసాలు కూడా ఇస్తారు.

2. డా॥ స్వర్ణముఖి - ఆమె నిజంగానే బంగారు రంగు కలిగిన ముఖము కలది. బంగారమునకు మెరుగు రావాలంటే అగ్నిలోవేసి సుత్తితో కొడతారు. అలాగే ఈమె పట్టుదలతో ఎన్నో కష్టాలకోర్చి, భగవంతుని సేవకు అంకితమై, సంసార జీవితాన్ని కాదని బ్రహ్మచారిణిగా వుంటూ, తనదంటూ ఒక శైలిని ఏర్పరచుకుని, తన వృత్తితోపాటు, సంగీత, సాహిత్యములతోపాటుగా ఉపన్యాసాలిస్తూ, రచనలు చేస్తూవుంటారు. వీరు స్త్రీ రోగులను పరీక్షిస్తుంటారు. దానిలో ప్రత్యేక వైద్య నిపుణురాలు.

- సశేషం

## భక్తులకు విన్నపము

శ్రీగురుదేవుల అనుగ్రహం వలన భక్తులు పొందిన అనుభవాలను గ్రంథస్థం చేసే ఉద్దేశ్యంలో తమ తమ అనుభవాలను వ్రాసి పంపమని విజ్ఞాపన చేసియున్నాము.

శ్రీగురుదేవుల స్వస్వరూప లయం తరువాత, శ్రీగురుమాత ద్వారా మనకు అనేకవిధాల రక్షణ జరుగుతోంది. అనేక లీలలను వారు చూపిస్తున్నారు. అనేక దివ్యానుభవాలు భక్తులకు కలుగుతున్నాయి.

భక్తులు పొందిన అట్టిఅనుభవాలను భక్తులందరూ పంచుకొనే సంకల్పంతో తలపెట్టిన "శ్రీసద్గురునాధుని దివ్య చరిత్ర – 3" గ్రంథం పేరు మార్చి **"శ్రీ గురు కృప"** అని పేరు నిర్ణయించటం జరిగింది.

అందరూ ఈ మార్పును గమనించి తమ తమ అనుభవాలను సమగ్రంగా వ్రాసి సత్వరంగా పంపమని ప్రార్థిస్తున్నాము.

# రామాయణంలో స్త్రీ పాత్రలు

-సుషుమ్నా ప్రసాద

# శబరి

శబరిమాత రామాయణంలో అరణ్యకాండలో ప్రత్యక్షమవుతుంది. ఆమెది చాలా విలక్షణమైన, విశిష్టమైన పాత్ర. ఆమె ఒక మహాభక్తురాలు. నిరంతరము రామనామ స్మరణతో, శ్రీరామ చంద్రుని దర్శనమే తన జీవిత ధ్యేయంగా భావించి, తరించిన మహా తపస్వి. ఆమె మాతంగ మహాముని శిష్యురాలు.

దివ్యపారిజాతమునకు వైకుంఠవాసియైన శ్రీమహావిష్ణువు సిగను అలంకరించే మహద్భాగ్యము లభించింది. కాని, దివ్యపారిజాతములకు మాత్రమే ఆ మహద్భాగ్యము లభిస్తుందని భావించనవసరం లేదు. స్వచ్ఛమై, పవిత్రమైన ఏ వన పారిజాతమైనా, లేక కుసుమమైనా పూజార్హమే. ఎక్కడో ఒక మారుమూల వున్న తపోధనుని పాదాలను అలంకరించే అడవిమల్లె జీవితం కూడా కడు పవిత్రమైనది.

రామాయణంలో శబరి కూడా ఒక విశిష్టమైన పరిమళ భరితమైన అడవిమల్లె. అడవిలో పుట్టి అడవిలోనే రాలిపోయింది. దివ్యమై, పరిమళభరితమై, భక్తి పరిమళాలతో విరాజిల్లే ఆ సుమబాల తన జీవితాన్ని మహాత్ముల సేవకు అంకితం చేసింది.

ఆ మహాతపస్విని జీవితమంతా మతంగాశ్రమ పరిచర్యలోనే గడిపింది. ఆమెకు గురుప్రబోధనల మీద, గురువాక్యాల మీద అచంచల విశ్వాసమున్నది. గురుమూర్తి శ్రీరామచంద్రుని దర్శన భాగ్యం తప్పక లభిస్తుందని ఆమెకు అభయమిచ్చారు. కాలక్రమేపి, మతంగమహర్షి ఆయన మిగిలి శిష్యులందరూ కూడా కాలగర్భంలో కలిసిపోయారు. వృద్ధురాలైన శబరి మాత్రమే ఆ ఆశ్రమంలో మిగిలింది. కానీ, ఆమెకు నిరాశ, నిస్పృహ దరికి చేరలేదు. సద్గురు సందేశమును అచంచల విశ్వాసముతో, ఏనాటికైనా శ్రీరామచంద్రుని దర్శనభాగ్యముతో తన జీవితం చరితార్థమవుతుందనే ప్రగాఢమైన విశ్వాసమే ఆమెను తరింపజేసింది. కళ్ళు కాయలు కాచేలాగా ఎదురు చూస్తూ నిలిచింది. ఆమె విశ్వాసం చెక్కుచెదరలేదు. అదే ఆమెలో ప్రత్యేకత. మతంగమహర్షి

శిష్యులు ఆమెను చూడటానికి వచ్చి, శ్రీరామచంద్రుని దర్శనభాగ్యం అమెకు తప్పక కలుగుతుందని, ఆయన వచ్చి ఆమె ఆతిథ్యాన్ని స్వీకరిస్తాడని, ఆమెకు పునర్జన్మలేని నిత్యానంద సుధను ప్రసాదిస్తాడని అభయమిచ్చి వెడతారు.

ఆనాటి నుండి శబరి అచంచల విశ్వాసముతో శ్రీరామచంద్రుని రాకకై వారి ఆతిథ్యానికై ఏర్పాట్లు చేయడం ప్రారంభించింది. చెట్టు చెట్టును శోధించి, పక్వమైన పండ్లను ఏరితెచ్చి, ప్రతిపండును రుచిచూసి పక్వమైన, మధురమైన ఫలాలను కోసి గంపను నింపింది. సెలయేటి నీటిని దొప్పల్లో నింపి వుంచింది. పాదపూజ కోసం ఆ వనంలో లభించిన రకరకాల పరిమళ పుష్పాలను కోసి, పూల సజ్జలలో సిద్ధంగా వుంచింది..

ఆ రోజు ఉదయం ఏదో తెలియని పరమానందం ఆమె హృదయాన్ని ఆవరించింది. ఆమె నేత్రాలూ కాంతులతో విరాజిల్లాయి. పండుటాకులా వున్న ఆ తల్లి మనస్సు ఉల్లాసోత్సాహాలనే చిగురుటాకులు తొడిగిన మొగ్గలాగా మారింది. నీలమేఘశ్యాముడైన రాముడు చిరునవ్వుతో ఆమె ముంగిట నిలిచాడు. నీడలా లక్ష్మణుడు అన్న వెంటే వున్నాడు. శబరికి దర్శన భాగ్యం లభించగానే చేతులు జోడించింది. ఆనంద భాష్పాలతో రామునికి పాదాభివందనం చేసి, అర్ఘ్య పాద్యాదులు ఇచ్చింది. శ్రీరామచంద్రుడు ఆమె భక్తి పారవశ్యాలు చూసి ముగ్ధుడై ప్రేమతో పలుకరించాడు. ప్రేమతో స్పృశించాడు. ఆ దివ్య స్పర్శతో ఆ యోగిని మేను అనిర్వచనీయమైన అనుభూతిని పొందింది.

శ్రీరాముడు ఆమె తపస్సు నిర్విఘ్నంగా సాగుతున్నదా, గురు శుశ్రూష ఫలించిందా అని ప్రశ్నించాడు. ఆమె తన జీవిత ధ్యేయము ఫలించినందుకు రామ దర్శన పారవశ్యంలో తన తపస్సు ఫలించిందని, గురుసేవా ఫలము పొందబోతున్నానని సమాధానమిచ్చింది. చర్మచక్షువులతో రాముని దర్శించటమే తన జీవిత పరమావధి, అది లభించి తన జన్మ చరితార్థమైనదని, రామదర్శనముతో అక్షయ లోకాలు పొందగలనని చెప్పింది. తాను చవి చూసిన ఫలాలను రాముని నోటికి అందించింది. లక్ష్మణునకు చేతికిచ్చింది. సోదరులిద్దరూ పరమానంద భరితులయ్యారు. శబరి మహర్షుల యజ్ఞ వేదికలను వారికి చూపించింది. మహర్షులు తమ తపశ్శక్తిచేత సప్త సముద్రాల జలాలను

ఆశ్రమానికి తెప్పించిన ఉదంతం చెప్పింది. బ్రహ్మానంద భరితురాలైన తనకు ఇహ ఈ భువి నుండి శెలవిప్పించమని, రామచంద్రుని సన్నిధిలోనే తన తనువును చాలించాలని కోరింది. రాముడు ఆనందంగా తల వూపాడు. యోగాగ్నిలో ఆమె దేహం దగ్ధం అయిపోయి, కోటి విద్యుత్తుల కాంతి అంతరిక్షంలోకి లేచి వెళ్ళింది.

శ్రీరామచంద్రునకు ఎంతో మంది మహాభక్తులున్నారు. ఎంతో సహాయం, సేవ చేసినవారున్నారు. శబరి రామచంద్రునకు చేసినదేమీ లేదు. కాని, ఆమెను చూడగానే శ్రీరామచంద్రుని హృదయం పరమ ప్రసన్నతా భావాన్ని పొందింది. సీతా వియోగం వలన జడమై, స్తబ్దమైన రామచంద్రుని హృదయాన్ని మేల్కొల్పింది.

రామాయణంలో అరణ్యకాండలో మణి దీపంలా ప్రకాశించే పాత్ర శబరి. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి 'రామాయణ కల్పవృక్షం'లో శబరి పాత్ర వినూత్నంగా ప్రకాశించింది. శబరి ఆత్మ తత్వాన్ని ఆకళించుకున్న మహాయోగిని. 'శబరి' అనే పేరు ఎంతో సార్థక నామధేయం. అర్థవంతమైనది. 'శ' అంటే శమదమాది షట్క సంపత్తితో, 'బ' అంటే బలీయమైన, 'రి' అంటే రిపులను (అరిషడ్వర్గాలను) జయించిన మహాభక్తురాలు. ఆమెకు భక్తి నీరాజనం సమర్పించటమే ఆమెకు అర్పించగల హృదయ నివాళి.

*వడ్లగింజపై పొరను తొలగిస్తే బియ్యపు గింజ అది తిరిగి మొలకెత్తదు. అలాగే అహంకారం, మమకారం అనే పొరలు తొలగిన మానవునికి పునర్జన్మ లేదు.*

*దేవుని సాధన పట్టుదలతో ఇప్పుడే ప్రారంభించు. మనస్సును శాంతంగా వుంచుకో. సురక్షితంగా పరమాత్మను చేరుకోగలవు.*

\- శ్రీబాబూజీ మహరాజ్


ప్రేమ
మధుప
ఇక్కడ పడవ ఏమీ లేదే? ఇప్పుడీ నదిని దాటడం ఎలా?
1
పదండి, ఇలాగే ఈదుకుంటూ వెళదాం!
2


ఈ పెట్టెని, పిల్లాడ్ని
మోస్తూ నా భార్యని కూడా
తీసుకు వెళ్లాలంటే
చాలా కష్టంగా ఉంది!
3


సామాను పోతే మళ్ళీ
కొనుక్కోవచ్చు. ఈ
పెట్టెను ఇక్కడే
వదిలేస్తాను.
4


ప్రవాహం ఇంకా ఎక్కువవుతోంది. ఇంక నా వల్ల కాదు. భార్య ఉంటే చాలు. పిల్లవాడు పోతే మళ్ళీ కనవచ్చు!
5


ఈ వరదలో నన్ను నేను కాపాడుకోవటమే కష్టంగా ఉంది. అసలు నేనంటూ బ్రతికుంటే ఇంకో పెళ్లి చేసుకోవచ్చు. ఇక నా భార్యను కూడా వదిలివేయక తప్పదు.
6


హమ్మయ్య!
భగవంతుని
దయవల్ల
మొత్తానికి ఒడ్డుకి
చేరాను. ఈరోజు
ఇలా బ్రతికి
బట్టకడతానని
అనుకోలేదు!
7


భార్యాపుత్రుల
తల్లిదండ్రుల
ఇతర
బంధుమిత్రుల
ప్రేమలన్నీ
అస్థిరాలే.
తనదాకా
వచ్చేసరికి ఎవరి
ప్రాణాలు వారికే
ముఖ్యం. కానీ
భగవంతుని
ప్రేమ సుస్థిరం.
అది
పరిస్థితులను
బట్టి
మారిపోయేది
కాదు.
8

# బ్రాహ్మణుడు

-పాలూరి కాళీప్రసాద్

వారి వారి గుణాలకు, కర్మలకు అనుగుణంగా నాలుగు వర్ణాలను నేనే సృష్టించానని భగవానుడు స్వయంగా శెలవిచ్చాడు. **'జన్మనా జాయతే శూద్రః సంస్కారాత్ భవేత్ ద్విజః'** అని పెద్దలు చెబుతారు. అంటే జన్మతః అందరూ శూద్రులే. ఆ తరువాత వారి వారి కర్మలు, సంస్కారాలను బట్టి వివిధ వర్ణాలుగా పరిణామం చెందుతారు. సత్వగుణాన్ని అవలంబించి ఇంద్రియ నిగ్రహము, శౌచము, ఓర్పు, నిజాయితీలను కలిగి వుండి, జ్ఞాన విజ్ఞానాలను సముపార్జించి, తాను చేసిన ప్రతి కర్మలో 'భగవంతుడు వున్నాడు, అన్నీ చూస్తున్నాడు' అనే విశ్వాసాన్ని ప్రదర్శించేవారు బ్రాహ్మణులు అనబడతారు. అలాగే రాజస గుణాన్ని అవలంబించి, తేజస్సు, ధైర్యం, పరిపాలనా దక్షత కలిగివుండి, యుద్ధంలో పలాయనం చిత్తగించకుండా వుండటం, దానగుణం కలిగి వుండటం, తాను ప్రభువుననే భావన కలిగివున్నవారు క్షత్రియులు అనబడతారు. అలాగే వ్యవసాయం, పాడి పరిశ్రమ, వర్తక వాణిజ్యాది వృత్తులు చేసేవారు వైశ్యులని, మిగిలిన సమాజానికంతటికీ పరిచర్యలు, సేవలు చేసేవారు శూద్రులని పిలవబడతారు.

ఇలా వారివారి వృత్తులు, ప్రవృత్తులను బట్టి ఆయా వర్ణాలు నిర్ణయించబడ్డాయి. శరీరం పనిచేయడానికి ఇంద్రియాలన్నీ ఎలా అవసరమో, సమాజం పనిచేయడానికి ఈ వర్ణాలవారందరూ అలాగే అవసరం. ఇందులో ఒకరు ఎక్కువ, ఇంకొకరు తక్కువ అనే ప్రశ్న లేదు. అయితే ఈ సత్యాన్ని గుర్తించకుండా కేవలం ఒక వంశంలో పుట్టినంత మాత్రాన తామేదో అధికులమని, అగ్రవర్ణం వారమని, మిగిలినవారు అంటరాని వారని తమ చుట్టూ గిరి గీసుకుని కొందరు తమని తామే మోసం చేసుకుంటూ వుంటారు. అయితే ఈ ప్రక్రియలో నిమ్న వర్ణాలవారని పిలువబడేవారు అవమానాల పాలవుతూ వుంటారు. అంతెందుకు, శ్రీగురుదేవుల బాల్యంలో ఒక ప్రక్క వారి మహిమను గుర్తిస్తూనే మరొక ప్రక్క వారి తల్లిదండ్రులెవరో, వారిదే కులమో తెలియదనే వంకతో వారిని దూరం పెట్టి, వారు భుజించిన విస్తరిని వారితోనే తీయించి శుద్ధి చేయించినవారు కొందరున్నారు.

అయితే నిజమైన బ్రాహ్మణుడెవరో యోగి వేమన ఇలా

వివరిస్తున్నారు ....

బమ్మ గుడ్డు యనెడు పట్నంబు లోపల,
బమ్మ నెరుగలేని బాపడేల?
తన మనంబు తెలియ దానే పో బ్రహ్మంటు
విశ్వదాభిరామ వినుర వేమ!

బ్రహ్మాండం అని పిలువబడే ఈ ప్రపంచంలో బ్రహ్మావస్తువును తెలిసికోలేనివాడు బ్రాహ్మణుడు ఎలా అవుతాడు? నిజంగా వెదకి చూస్తే, తనలోనూ, సర్వసృష్టిలోనూ నిండివున్నది ఆ బ్రహ్మావే. అట్టి బ్రహ్మావస్తువును తెలుసుకున్న వాడు తానే బ్రహ్మ అవుతాడు. '**బ్రహ్మావిత్ బ్రహ్మైవ భవతి**'. నిజంగా సకల చరాచర విశ్వమంతా నిండి వుండి అన్నింటినీ ప్రకాశింపజేస్తున్న పరబ్రహ్మ వస్తువును గుర్తించిననాడు ఇక కులమత భేదాలు ఎక్కడి నుండి వస్తాయి?

అచల సిద్ధాంతంలో నిష్ణాతురాలైన మా మామ్మగారు శ్రీమతి ఎఱ్ఱాప్రగడ శేషమ్మగారు ఇలాంటిదే ఒక పద్యం చదివేవారు ........

**ఆకారము శూన్యంబై రాకడ**
**పోకడలు లేక రంజిల్లుచుండే**
**లోకాతీతుని గానక చీకాకు పడేటి**
**వారు బ్రహ్మలే చెప్పుమా!**

బ్రహ్మ పదార్థమంటే అది కంటికి కనిపించేది కాదు. **యదృశ్యం తన్నశ్యం** అన్నారు. కంటికి కనిపించేవన్నీ ఎప్పుడో ఒకప్పుడు నశించిపోయేవే. ఈ ఆకారాలన్నీ ఒకప్పటికి వికారాలుగా మారిపోవలసిందే. మరి దేనిని చూసుకుని మనకింత అహం భావన? నేను అగ్రవర్ణం వాడినని విర్రవీగే నీ శరీరమైనా, నీవు అంటరానివాడని చీదరించుకునే వాని శరీరమైనా చివరికి ఒక చోటుకే చేరవలసినదే కదా. ఇక 'నేను వేదవేదాంగాలు చదువుకుని చాలా జ్ఞానం సంపాదించాను. వాడు వట్టి అజ్ఞాని' అంటావా? పిపీలికాది బ్రహ్మ పర్యంతం నిండి వున్న అసలు తత్వాన్ని తెలిపే వేదాంత సారాన్ని వంటబట్టించుకోకుండా కేవలం శ్లోకాలు, మంత్రాలు వల్లె వేయగలగటం జ్ఞానం ఎలా అవుతుంది? అది కేవలం పాండిత్యమే అవుతుంది.

- సశేషం

# ఎవరు అమరుడు?

-సుషుమ్నా ప్రసాద

పూర్వకాలంలో ఋషి పుత్రులందరూ జిజ్ఞాసువులు. బ్రహ్మము నందే వారి మనస్సు లగ్నమయి, ఆ బ్రహ్మ తత్వాన్ని గ్రహించాలని తాపత్రయపడేవారు. భరద్వాజుని కుమారుడు సుకేశుడు, శిబి పుత్రుడు సత్యకాముడు. సౌర్యుని కుమారుడు సౌర్యాణి, అశ్వలాయనుని తనయుడు కౌసల్యుడు, విదర్భ ఋషి పుత్రుడు భార్గవుడు, కాత్యాయనుడి పుత్రుడు కబన్ధి. ఆ ఆరుగురు ఋషి కుమారులు మంచి మిత్రులు. కుశాగ్ర బుద్ధి గలవారు. వారికి పరబ్రహ్మను తెలుసుకోవాలనే ప్రగాఢ వాంఛ కలిగింది. వెంటనే వారు సమర్థుడైన సద్గురుమూర్తిని అన్వేషిస్తూ బయలుదేరారు.

ఆ కాలంలో పిప్పలాద మహర్షి మహాజ్ఞాని. పండిత శిరోమణి. మహా తపస్సంపన్నుడు. వైరాగ్యసంపన్నుడు. పిప్పలా అంటే రావి. ఆ మహర్షి కేవలం రావి పండ్లను తిని జీవించేవాడు. అందుచేత ఆయనకు పిప్పలాదుడు అనే పేరు వచ్చింది. ఆ మహర్షి సమర్థత ప్రతిభాపాటవాన్ని గ్రహించిన ఈ ఆరుగురు ఋషికుమారులు ఆయన్ను వెదకుతూ బయలుదేరారు. వారి మహద్భాగ్యం వలన పిప్పలాద మహర్షి దర్శనం లభించింది. బ్రహ్మతేజస్సుతో వెలుగుతున్న ఆయనను చూసి, వారే తమ సమస్యలను పరిష్కరించి తమను బ్రహ్మజ్ఞానులుగా చేయగల సమర్థులని గ్రహించారు. ఒక శుభ ముహూర్తాన ఆరుగురు ఆప్తమిత్రులు కలసి సమిధలు, దర్భలు, ఫలపుష్పాదులను పుచ్చుకుని, పిప్పలాద మహర్షి సన్నిధికి చేరారు. ఎందుకంటే మన భారతీయ సంప్రదాయ ప్రకారం, మహాత్ములు, గురువులు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లల వద్దకు వెళ్లినప్పుడు వట్టి చేతులతో వెళ్లకూడదు. ఫలపుష్పాదులను తీసుకుని వెళ్లాలి.

పిప్పలాద మహర్షి ఒక వృక్షపు నీడలో, ఏకాంతంగా ధ్యాన ముద్రలో వున్నారు. వీరు ఆరుగురు వినమ్రులై నిలబడి, వారు ధ్యానముద్ర నుండి బయటకు రాగానే సమిధాదులను సమర్పించారు. తమ నామ గోత్రాలను చెప్పి, సాష్టాంగ నమస్కారం చేశారు. పిప్పలాద మహర్షి వారిని దేనికోసం వచ్చారని ప్రశ్నించారు. 'మహాత్మా! మేము పరమాత్మ తత్వాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలనే ప్రగాఢమైన వాంఛతో జ్ఞాన

సముపార్జనకై మీ సన్నిధికి వచ్చాము' అని విన్నవించారు.

వారి మన్ననను విన్న పిప్పలాద మహర్షి 'ఓ ఋషిపుత్రులారా! మీరు ఒక సంవత్సరకాలంపాటు ఇంద్రియ నిగ్రహం వహించి, బ్రహ్మచర్యదీక్షతో సమాచరిస్తూ, నా శుశ్రూష చేయాలి. మీ నియమ నిష్ఠాదులతో నన్ను సంతృప్తిపరిస్తే, అప్పుడు మీకు ఉపదేశం చేసి, మీ సంశయాలకు సమాధానం చెబుతాను. సుకేశాదులు వారి సమాధానం వారి జనకులకు విన్నవించారు. సద్గురుదేవుల ఆదేశం ప్రకారం వారు నియమనిష్ఠలు, బ్రహ్మచర్యవ్రతం, తపము ఆచరించి వినమ్రులై పిప్పలాది మహర్షి అనుగ్రహానికి పాత్రులయ్యారు. అప్పుడు మహర్షి వారిని పిలిచి, 'మీరు శ్రవణానికి పాత్రులయ్యారు. మీ సంశయాలను తెలియజేస్తే, నాకు తెలిసినంత వరకూ మీకు నివృత్తి చేస్తాను' అన్నారు.

అప్పుడు వారిలో కబన్ధి అనే ముని కుమారుడు లేచి, 'ఈ చరాచర జగత్తులో వున్న సమస్త జీవులు దేనినుండి ఉద్భవిస్తున్నాయి?' అని ప్రశ్నించాడు. మహర్షి చిరునవ్వుతో 'ఓ కబన్ధీ! ఈ చరాచర జగత్తులో వుండే ప్రాణ సముదాయానికంతటికీ సృష్టికర్త ప్రజాపతే. బ్రహ్మకు సృష్టి చేయాలనే సంకల్పం కలిగింది. తన సంకల్ప సిద్ధి కోసం ఏకాగ్రచిత్తంతో తపస్సు చేశాడు. ఆ సంకల్పం నుండే ఈ జగత్తు జనించింది. జగత్తు తన సృష్టికి తోడ్పడాలనే ఉద్దేశంతో అన్నం, ప్రాణం అనే జంటను సృష్టించాడు. ప్రాణమంటే అగ్ని. వీటి సమ్మేళనంతో సమస్త సృష్టి జరిగింది.

బ్రహ్మచేత సృష్టించబడిన ఈ అన్న అగ్నులు రెండిటిలో అన్నాన్ని భక్షించే అగ్నే ప్రాణము సూర్యుడు. అన్నమే చంద్రుడు. ఈ ప్రపంచం ప్రజాపతిచేత నిర్మించబడి, పంచభూతాలతో ప్రకాశిస్తోంది. ఈ పంచభూతాలు మూర్తరూపంగా (స్థూలం) (పృథ్వి, జలము, అగ్ని). అమూర్త రూపంగా (సూక్ష్మం) ఆకాశము, వాయువుగా ప్రకాశిస్తున్నాయి.

ప్రాణం సూర్యుడై ఉదయించి, తన ప్రకాశం చేత, తూర్పు నుండి నాలుగు దిక్కులా వ్యాపించి ఆయా దిక్కులలో వుండే సమస్త ప్రాణులను తన కిరణాలతో తన స్వరూపంగా చేస్తున్నాడు. అతడే సర్వాత్ముడైన విశ్వరూపుడు' అన్నాడు మహర్షి.

- సశేషం

# జగమెరిగిన స్వామీ

- పెనుమాక నాగేశ్వరరావు

జగమెరిగిన స్వామీ, నిజమెరిగిన స్వామీ
జగమంతయు నీవేగా సర్వాంతర్యామీ
నిజమే నువ్వు కదా ఓ అంతర్యామీ
జగమే మిధ్య కదా సద్గురు స్వామీ

జగన్నాటక సూత్రధారీ, చక్రధారీ
జగమేలే విశ్వమందిర విహారీ
జయమేలే మాకిక మా మానస సంచారీ
జయకృష్ణా ముకుందా మురారీ

జగత్పావన మూర్తి మా సద్గురుమూర్తి
జగత్సాక్షివి నీవేగా జగన్మోహన మూర్తీ
విశ్వాసానికి స్ఫూర్తివి ఓ విశ్వమోహన మూర్తీ
పతిత పావన మూర్తీ పరమానంద మూర్తీ

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఆగస్ట్, సెప్టెంబర్ 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఆగస్ట్ 2020:*** AS 7141, 7143, 7797, 8160, 8166 to 8185, 8187 to 8189, AS 8191 to 8209, 8212, 8213, 8216, 8217, 8219 to 8228, AS 8231 to 8238, 8240 to 8249, 8251 to 8260, 8262 to 8264, 8267 to 8275, 8281 to 8284, 8287 to 8289, 8343, AS 8346, 8360 to 8366.

***సెప్టెంబర్ 2020:*** AS 7151, 7154 to 7156, 7163, 7168, 7169, 7589,7597 8291 to 8340, 8348 to 8358, 8371, 8372, 8377, 8380, 8381, 8387, 8388.

# శ్రీబాబు దివ్యవాణి

**14-10-1980 శ్రీదేవీ శరన్నవరాత్రులు -** - డా॥ రాఘవేంద్ర. పరుచూరి

రూపనామ క్రియలకు అతీతమైన ఆత్మశక్తి స్వరూపిణి జగజ్జనని. ఆవిడ దివ్య కటాక్షము వలన మనం మనలో వున్న నానాత్వాన్ని హరింప జేసుకుని, నిత్యసుఖాన్ని పొందవచ్చు. జగజ్జనని దివ్య చరణారవిందాల యందే మనస్సును నిలిపి వుంచితే చాలు, భగవంతుని తత్త్వాన్ని బాగా జీర్ణం చేసుకుని మన యొక్క కించిజ్ఞత్త్వము అంతటిని హరింప చేసుకోవచ్చు. వీడు(బాబు) ఏమీ తెలియనివాడు, ఏమి మాట్లాడతాడు? వీడికి ఆ రామనామము యొక్క రెండు అక్షరాలు యందు వున్న మధరుత్వమే తెలుసు. అదైనా ఆ రామపాదుకల కటాక్షమే.

భారతదేశంలో సమర్థరామదాసు, కబీర్ మొ॥గు మహాత్ములు ఎంతోమంది నిరంతరం రామనామమును కీర్తించి, జపించి, స్మరించి తరించినవారున్నారు. వారంతా అంతరేంద్రియములు మనసు, బుద్ధి, చిత్తము, అహంకారములు నాలుగింటిని ఆ దివ్యనాథుని యందే నిలిపి, ఆ నామమునే ధ్యానిస్తుండేవారు. ఆ ధ్యాన తీర్థము వారి హృదయమందు చేరి, అంతరేంద్రియములు నాలుగూ వరుసగా సత్యం, శాంతి, దయ, ప్రేమగా మార్చేసినది.

రామనామము మధురాతి మధురమైనది. అంతేకాదు, మహత్తర శక్తివంతమైనది. ఈ రామనామ రసమే ధ్యానంలో వుత్పన్నమైన అమృతరసము. అది మన హృదయంలో ప్రవేశించగానే కోరికలు, సంకల్పములు, భావములు మలినంతో కూడి వున్న మనస్సుని మధురంగా అంటే సత్యంగా మార్చేస్తుంది. ఇక ఆ హృదయం నుండి వచ్చే భావన ఏ మానవునికీ హానికరముగా, దోషయుక్తముగా, కలుషితంగా వుండవు. అంటే కలుషితమైన మనస్సు రామనామస్మరణతో శుద్ధపడింది. తులసిరసంలో పాదరసాన్ని వుంచినట్లయితే రెండు మూడు గంటలకు అది గట్టిపడుతుంది. అప్పుడు దాన్ని నేలకేసి కొట్టినా అది చలించదు. సహజంగా పాదరసం (మనసు) అతి చంచలమైనది. కాని అది తులసి (రామనామ మహాత్మ్యం)తో గట్టిపడుతుంది. అందుకే ఆయనకు తులసీదాముడని సార్థక నామధేయం వున్నది.

ఏ భక్తుడైనా సరే దేహభ్రాంతి తొలగి, ఈశ్వర స్థితిని పొందిన వారి హృదయమును భగవానుడు అలంకరిస్తాడు. ఎవరి మనస్సు నందు పరమాత్మ నిలిచి వుంటాడో, వారికి ఇక జపతపములేల? ఆ మనస్సుకు ఎక్కడా వృత్తి ఉత్పన్నమవదు కదా? వృత్తి ఉత్పన్నమైతేనే కదా జన్మ వుంటుంది. అట్టివారి మనస్సు తారక బ్రహ్మరూపాన్ని ధరిస్తుంది. అటువంటి మనస్సు ఇక దేనిని చూస్తుంది? సర్వ ప్రకృతిలో కూడా సర్వ భూతాలను ప్రకాశింపజేస్తూ, స్వయంగా ప్రకాశించే తారక బ్రహ్మాన్నే దర్శిస్తుంది. త్యాగయ్య చీమలో, దోమలో కూడా ఆ పరబ్రహ్మాన్నే దర్శిస్తూ తమ కీర్తనలో కూడా చక్కగా రచించాడు.

త్యాగయ్య చూసినట్లుగా మనం చూడగలమా? ప్రతివారూ చూడవచ్చు. కాకపోతే, అంతటి ఆవేదన, పట్టుదల, విశ్వాసం వుండాలి. అలా వున్నప్పుడు ప్రతివారూ తప్పక భగవానుని చూడగలరు. ఈ జన్మలో భగవానుని చూడలేని ఈ కళ్ళు మాడిపోయిన బల్బులే కదా! ఏదో చూస్తున్నానని మురిసిపోతాడు మానవుడు.

మూడు అవస్థలలోనూ జ్యోతి దర్శనం కాకుండామనలో ఆవరించిన ఆవరణలే కదా ఇనుప మూకుడు, జల్లెడ, గ్లాసు వంటి ఆవరణములు. మొదటిది అహంకారమనే మూకుడు. అది కప్పబడి పోయినప్పుడు వస్తు దర్శనం వుండదు. అంటే అహంకారం ఇనుప మూకుడు వంటిది. ఇనుప మూకుడు దీపపు కాంతిని బయటకు రాకుండా కబళించివేస్తుంది. చీకటి గదిలో ఏమీ కనిపించవు. ఆ గదిలో వస్తువులు వుండవచ్చు, విషజంతువులు వుండవచ్చు. తనకు కావలసిన వస్తువు కనబడదు. ఆ మూకుడు దగ్గరకు వెళ్ళి దాన్ని పగుల గొడితే జ్యోతి దర్శనం అవుతుంది. ఆ గదిలో చీకటిపోయి వెలుగు వస్తుంది. కాని, ఆ దీపంపై రెండవ ఆవరణ జల్లెడ రూపంలో వున్నది. కాబట్టి ఆ జల్లెడ బెజ్జముల నుండి కాంతి కిరణాలు నీడగా కనిపిస్తాయి. కానీ, కాంతి పూర్తిగా కనబడదు. జల్లెడ వంటి రెండవ మూకుడు కూడా తీసివేస్తే పూర్తి జ్యోతి దర్శనం అవుతుంది.

- సశేషం

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

ఈ వాసన వల్లనే మనోభావాలు, ఆలోచనలు వాటివలన శరీరం ద్వారా కార్యకలాపాలు జరుగుతాయి. ఆ కార్యాలే కర్తకు చుట్టుపట్ల వుండదగిన పరిస్థితులను నిర్ణయిస్తాయి. ఒక వ్యక్తిలో పరమాత్మ అభివ్యక్తం కావడానికి వాసనలే సూక్ష్మమైన కారణాలు అవుతున్నాయి. అందువలన వాసనలు కారణ శరీరం అవుతున్నాయి..

జాగ్రదావస్థలో వున్న విశ్వునికి, స్వప్నావస్థలో వున్న తైజసునకు, తెలిసిన విషయ ప్రపంచం సుషుప్తిలో వుండదు. సుషుప్తి అవస్థలోని అనుభవం పూర్తి అజ్ఞాన స్థితి. తమస్సు చేత ఆవరింపబడినది. ఈ అజ్ఞానంలో వున్న తమస్సు దఃఖాన్నిగాని, సుఖాన్ని గాని ఏమాత్రం ఇవ్వలేదు. అది అభావ రూపంలో అశక్తమైవున్న ఒక మధ్యమ స్థితి. ఆనంద స్థితి.

గాఢ నిద్ర నుండి లేచి, హాయిగా వున్నదని, అలసట అంతా తీరిపోయిందని అంటున్నాము. గాఢ సుషుప్తిలో భగవంతుడు మనకు ప్రసాదించిన క్లోరోఫారమ్, ఇవన్నీ కూడా మన స్వరూపమే, మనం పొందే అవస్థలే అని 13వ మంత్ర వ్యాఖ్యానం.

14వ మంత్ర వ్యాఖ్యానం - మరల ఆ జీవుడే పూర్వ జన్మ కర్మవశాత్తు నిద్ర నుంచి మేల్కొన్నవాడు (ప్రబుద్ధుడు) అవుచున్నాడు. ఈ విధంగా మూడు పురముల యందు, మూడు అవస్థలలో ఆత్మ విచిత్రంగా క్రీడిస్తోంది. ఆ ఆత్మ నుండే ఈ సకల జగత్తు ఉద్భవించింది. ఈ మూడు అవస్థలకు అతడే ఆధారం. అతడే అఖండ బోధ రూపమైన జ్ఞాన స్వరూపం. అతడి (ఆత్మ) యందే జాగ్రత్, స్వప్న, సుషుప్తి మూడు అవస్థలు లయం పొందుతున్నాయి.

కను చీకటిలో పూర్తిగా చీకటి పడక ముందు ఒకడు ఆ దారిలో వెడుతూ వుంటే అక్కడ పాము వున్నదని భ్రమిస్తాడు. భయంతో వణికిపోతాడు. బుస కూడా వినిపించింది. కదులుతోంది. ఇంతలో ఎవరినో రమ్మనమని పిలిస్తే ఆయన పాముని చంపడానికి ఒక కర్ర , ఒక లైటు తీసుకుని వస్తాడు. తీరా ఆ దీప కాంతిలో చూసే సరికి అది పాము కాదు, త్రాడు అని తెలుస్తుంది. భయం పోతుంది. ఆ దీప కాంతిలో చూడక ముందూ అది త్రాడే, మధ్యలో భ్రమ చెందినప్పుడూ అది త్రాడే, దీప కాంతిలో కనబడినప్పుడూ అది త్రాడే. మధ్యలో మనస్సు వలన అది

పాము అని భ్రమ చెందాడు. పాముగా కనిపించింది. అక్కడ పాము ఎప్పుడూ లేదు. అక్కడ ఎప్పుడూ మూడు కాలాలలోనూ వున్నది త్రాడే. భయ భ్రాంతులకు కారణం మన మనస్సే. లైటు వేయగానే ఆ భయము, భ్రాంతి రెండూ తొలగిపోయాయి.

అలాగే మనకి కనిపించే ప్రపంచానికి స్వయం సత్తాలేదు, స్వయం శక్తి లేదు. మనకి జ్ఞానం కలగక ముందూ దానికి ఆధారం పరమాత్మ ఒక్కటే. ఇప్పుడు కూడా పరమాత్మ యొక్క చిచ్ఛక్తియే ప్రకాశిస్తోంది. మనం గుర్తించిన తరువాత కూడా వుండేది ఆ పరమాత్మయే. స్వప్నావస్థలో నువ్వు పడిన ఆందోళనంతా, చూసినదంతా సూక్ష్మరూపంలో వున్న మనస్సు యొక్క కల్పితమే. మెలకువ రాగానే ఆ స్వప్నం అదృశ్యమవుతుంది.

శ్రీ మాతాజీ తమ బోధను ఇంకా కొనసాగిస్తూ... త్రికాలముల యందు ఆధారమైనదీ, ప్రకాశించేదీ ఆ పరమాత్మయే అని... **ఎవరికి తెలియగ తరమౌను బాబును** .... అన్న కీర్తనలో ఒక చరణం ఆలపించారు. ఏదేశమందుము ఏ కాలమందుము? ఆకాశమునకేది దేశము, కాలము?

బాబుని అంటే మన గురుదేవులు. ఆ చిన్ని కృష్ణుడు. ఎవరికి తెలియగ తరమౌతుంది? దేని నుంచి అయితే సర్వ సృష్టి ఉద్భవించిందో, దేని ఆధారంతో సర్వం ప్రకాశిస్తోందో, ఆకాశానికి కూడా స్థానమిచ్చి, ఆధారమిచ్చి, శక్తినిచ్చి ప్రకాశింపజేసేది ఆ పరమాత్మయే. ఆకాశంలోని నక్షత్రాలకు, గ్రహాలకు కూడా అతడే ఆధారం. అటువంటి గొప్ప విషయం గురించి మనం నేర్చుకుంటున్నాము. మనలను గురుదేవులు కైవల్యంలో కూర్చోబెట్టుకున్నారు. ఎటు చూసినా ఆత్మ తత్వమే.

మనమందరం కైవల్యంలోనే వున్నాం. కైవల్యం అనేది కనిపిస్తుందా? పోనీ అందుతుందా? అది ఏ రూపంలో అందుతుంది? ఒక మధురమైన పదార్థం కాని, కారం పదార్థం కానీ నాలుక మీద వేసుకుంటే ఆ పదార్థం యొక్క రుచి తీపి, లేదా కారం వాటిలో హెచ్చుతగ్గులు చెప్పగలిగే శక్తి నాలుకకు వున్నది. ఆ శక్తికి కారణమైనది మనస్సు. ఆ మనస్సుకే శక్తినిచ్చే అనంత శక్తి ఒకటున్నది. అది తానే అని గుర్తించిన మనస్సు ఎందులో వుంటుంది?

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**ఆగస్ట్ 2020**

1 శని - శనిత్రయోదశి

3 సోమ - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

11 మంగళ - శ్రీకృష్ణాష్టమి - కలశస్థాపన, రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్తసమారాధన. రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ.

12 బుధ - ఉదయం 11గం. సామూహిక రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్తసమారాధన.

13 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన, ఏకాహం సంకీర్తన.

17 సోమ - మాసశివరాత్రి

19 బుధ - అమావాస్య

22 శని - వినాయక చవితి - తె.జా 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, ఉదయం 11గం. సామూహిక గణపతిపూజలు, భక్తసమారాధన.

**సెప్టెంబర్ 2020**

2 బుధ - భాద్రపద పౌర్ణమి - శ్రీ సద్గురుపాదపూజ.

5 శని - ఉపాధ్యాయ దినోత్సవం.

12 శని - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

16 బుధ - మాసశివరాత్రి.

17 గురు - మహాలయ అమావాస్య

5-7-2020 నుండి 14-8-2020 వరకు శ్రీరామానుజ దాసుగారిచే శ్రీ సంపూర్ణ రామాయణ ప్రవచనం

# అత్రి మహర్షి

- రమణ ప్రసాద్

అత్రి మహర్షి సప్త మహర్షులలో ఒకడు. అనసూయా మహాసాధ్వికి భర్త. మహా తపస్సంపన్నుడు. సృష్టి కార్యములో తనకు సహాయం చేసేందుకు బ్రహ్మదేవుడు అత్రిని పుట్టించాడు. బ్రహ్మదేవుడు అత్రితో, "నువ్వు తపస్సు చేసి లోక సంరక్షణ కొరకు కొందరిని సృజింపవలెను" అనగా అత్రి తండ్రి ఆజ్ఞానుసారంగా తపస్సు చేయ నారంభించాడు. నశ్వరమగునది దేహం అని, శాశ్వత మైనది ఆత్మ అని తెలుసుకోవటానికే యమ నియమాలు, తపోవ్రతాలు ఏర్పడ్డాయి. దేహంపై మమత్వం నశింపచేయటంకోసం కఠిన నియమాలతో శరీరాన్ని తపింపచేసి, ఆత్మానందస్థితి పొందినవారే మహర్షులు. ఆ స్థితిని పొందటానికి నిత్య తపోనిరతియే మార్గము. ఆ స్థితిని పొందటం కోసమే అత్రి తపస్సు చేస్తున్నాడు. అతడు చేసే మహోగ్ర మైన తపస్సు చేత అతని నేత్ర గోళాలనుండి ఒక దివ్య తేజస్సు భూనభోంతరాళాలకు వ్యాపించి సముద్రంలో పడింది. బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చి, ఆ తేజమును తాను ధరించి తన అంశతో అత్రికి చంద్రుడిగా పుడ్తానని చెప్పాడు.

కొంత కాలానికి దేవహూతీ కర్దములకు విష్ణుమూర్తి కటాక్షంతో తొమ్మిది మంది కుమార్తెలు, ఒక కుమారుడు జన్మించారు. కర్దమ ప్రజాపతి తన కుమార్తెలను బ్రహ్మర్షులకే ఇచ్చి వివాహంచేయటానికి నిశ్చయించినవాడై, అత్రికి తన కూతురైన అనసూయను ఇచ్చి వివాహం చేశాడు. వివాహానంతరం సతీ సమేతంగా అత్రి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

అనసూయ తన భర్తనే తన దైవంగా ఎంచి అతనికి సకలోపచారాలు చేస్తూ, జ్ఞానోపదేశము అతని వలన పొంది మహాసాధ్విగా పేరు పొందినది. ఆమె గొప్పతనము రోజు రోజుకీ పెరుగుతుంటే, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అనసూయ మహాత్మ్యమును పరీక్షించటానికి వచ్చి వారి ఆతిధ్యాన్ని కోరారు. అత్రి అది తన సౌభాగ్యంగా భావించి అర్ఘ్య పాద్యాదులను ఇచ్చి వారిని కూర్చుండబెట్టాడు. ఆ త్రిమూర్తులు, "మాకు ఒక వ్రతం ఉంది. దాని ప్రకారం మాకు వడ్డించే స్త్రీ వివస్త్ర అయి ఉండాలి" అని చెప్పగా అత్రి ఈ విషయాన్ని అనసూయకు చెప్పగా ఆమె దానికి అంగీకరించింది.

త్రిమూర్తులు స్నానం చేసి వచ్చి కూర్చున్నారు. వారిపైన అనసూయ మంత్రించిన జలాన్ని చల్లగా ఆ ముగ్గురూ చంటిబిడ్డలయ్యారు. ఆమె నగ్నయై వడ్డించి తిరిగి వస్త్రం ధరించి వారిపై మంత్రించిన జలం చల్లింది. అప్పుడు వారు యథాపూర్వకంగా తమ నిజ రూపాలను ధరించగా, వారిని భోజనం చేయమని, వారు భుజించగా వారిని  మరల శిశువులుగా చేసి ఉయ్యాలలో పెట్టి ఊపసాగింది. అంతలో సరస్వతి, లక్ష్మి, పార్వతులు తమ భర్తలను వెదుకుతూ వచ్చి అనసూయను పతిభిక్ష పెట్టమని వేడుకొన్నారు. అనసూయ వారికి ఆ ముగ్గురు బిడ్డలను ఇచ్చింది.  వారు తమ భర్తలకు నిజ రూపములు వచ్చునట్లు చేయమని ప్రార్థించగా, ఆ బిడ్డలను త్రిమూర్తులుగా చేసి ఇచ్చింది. అంత వారు భార్యా సహితులై అనసూయ మహాత్మ్యమును మెచ్చుకొని, తమ అంశలతో ముగ్గురు పుత్రులు కలుగుతారు అని ఆశీర్వదించారు.

ఒకసారి కౌశికపత్ని సుమతి సూర్యుడు ఉదయింపకుండగా శాసించగా లోకోపద్రవము సంభవించింది. బ్రహ్మాది దేవతలు ఆ వుపద్రవమును బాపమని అనసూయను కోరారు. అనసూయ సుమతిని అంగీకరింపజేసి సూర్యోదయ మగునట్లు చేసి ఆమె భర్తని వెంటనే బ్రతికించింది.

అత్రిమహర్షి భార్యతో కలిసి ఋక్ష పర్వతం మీద నివసించి దేవదేవుని గురించి నూరు సంవత్సరాలు ఘోరమైన తపస్సు చేశాడు. ఆ తపోబలంచేత త్రిమూర్తులు ప్రత్యక్షమయ్యారు. అత్రి మహర్షి వారిని పూజించి, “నేను సత్సంతానార్థమై దేవదేవుని గురించి తపస్సు చేశాను. మీముగ్గురూ ఎందుకు వచ్చారు? మీలో అధికులెవ్వరు? అని ప్రశ్నించాడు. “మాకు భేదం లేదు. మాఅంశాలతో నీకు పుత్రోదయం అవుతుంది” అని దీవించి అదృశ్యులయ్యారు.

కాలక్రమాన అత్రిమహర్షి నేత్ర గోళాలనుండి చంద్రుడు, అనసూయ గర్భంనుండి దత్తాత్రేయ దుర్వాసులు జన్మించి తల్లి తండ్రులకు అమితానందాన్ని చేకూర్చారు.

- సశేషం

# శ్రీ మళయాళ స్వామి సేకరణ - మురళి

శ్రీ వ్యాసాశ్రమ వ్యవస్థాపకులు శ్రీ మళయాళ స్వామివారి బోధామృతము. మనో నిర్మలత్వము, దైవానుగ్రహము, సద్గురు కరుణ లేనివారికి మోక్షము లభించడం కష్టం. ఈ మూడు ఏకకాలంలో సాధించడం దుర్లభము. కానీ, ఒక్కొక్క దానిని సాధించి పరిపూర్ణుడు కావాలి. మోక్ష మార్గమందు మృదు. మంద, తీవ్రములను (ఉత్తమ, మధ్యమ, కనిష్ఠాధికారులను) మూడు తరగతులు మహర్షులచే ఏర్పడినవి.

అధిక సమయం ప్రవత్తి మార్గంలో వుండి, సన్మార్గియై అప్పుడప్పుడు మాత్రం సాధుసంసర్గం, ఆత్మవిచారణతో కూడి వుండటం వలన ప్రపంచ విషయాదులను వదిలించుకోవడం కష్టముగా తోస్తుంది. వీరు భగవద్గీతయందు చెప్పిన రీతిగా నిష్కామ కర్మము శ్రద్ధా భక్తులతో చేసినట్లైన మనోనిర్మలత్వం (మృదుత్వం) కలుగుతుంది. శాస్త్రోక్తములైన జప, పూజ, ధ్యాన, తపములు ఈశ్వరార్పణ బుద్ధితో, శ్రద్ధా భక్తులతో చేసినప్పుడు సమస్త పాపములు నశించి, ప్రకృతి వికృతులు నశించి, నిర్మల హృదయులై పరమ శాంతులవుతారు. తరువాత రాగద్వేషాలు నశించి, విషయ విరక్తి కలిగి వైరాగ్యము పొందుతారు. తరువాత నిత్యానిత్యవస్తు వివేకము కలిగి, అనిత్యములైన దేహ, ధన, పుత్ర దారాదుల యందు విరక్తి కలిగి మోక్షమునందు తీవ్రతర విచారణ కలుగుతుంది. అట్టివారు నిరతిశయానంద మోక్షమును పొందుతారు. దీని సారమేమంటే తపో ధ్యాన నిష్ఠ లేనివారికి రాగద్వేషములు, అరిషడ్వర్గాలు నశించవు. ఇవి నశించనివారికి మోక్షావస్థ దుర్లభం.

విషయ సుఖములందు పూర్ణ నిరాశ కలుగకముందే మోక్షం కొరకు అధికమగు అభిలాష కలగటాన్ని మందము అంటారు. అట్టివారు ధర్మముతో కూడుకుని సంసారమందు అర్ధ సమయము, అర్ధ సమయాన్ని ఈశ్వర ధ్యాన, సాధు సేవలలో గడుపుతారు. వీరికి యజ్ఞ యాగాది కర్మలను చేయనవసరం లేదు. ఈశ్వరోపాసన మాత్రము తప్పక చేయాలి. అనన్య భక్తి వుండాలి. శ్రీ ఆదిశంకరాచార్యులవారు 'నిత్యము పరబ్రహ్మ ధ్యానము అనన్య చింతనతో చేయనివారికి బ్రహ్మపదము

అందదు. కాబట్టి జిజ్ఞాసువులు మోక్షము కోసం సర్వదా, సర్వావస్థల యందు పరబ్రహ్మ ధ్యాన నిష్ఠయందు వుండాలి' అని చెప్పారు.

తీవ్ర మార్గము, లేక ఉత్తమాధికారి లక్షణము. వీరు జన్మతః విరక్తులై పూర్వజన్మ సంస్కార శక్తిచే మల అజ్ఞాన రహితులై, శుక వాసుదేవాదులవలె ప్రపంచ వాంఛా శూన్యులై వుంటారు. వీరికి యజ్ఞ దాన, తపః కర్మ చేయాలనే నిర్బంధం లేదు. వీరు తత్వమస్యాది మహావాక్య శ్రవణ, మనన, నిదిధ్యాస వలన ఆత్మసిద్ధి కలిగినవారు. వీరు కొంతకాలము జన బాహుళ్యము లేని నిర్మల స్థలము నందుండి ప్రణవ మంత్రమును మాత్రానుసంధానముగా ధ్యానము చేయాలి. అనగా నేను పంచకోశ విలక్షణుడను, అవస్థాత్రయ సాక్షిని, దేహత్రయాతీతుడను, నిత్య శుద్ధ బుద్ధ ముక్తుడై శుద్ధ శివస్వరూపుడనేనని ధ్యానించినప్పుడు మల, అజ్ఞాన, విక్షేపములను హృదయ గ్రంధులు భేదించి స్వయంగా స్వస్వరూప స్థితి కలుగుతుంది. ఎవరి హృదయమందు సమస్త కామములు నశించి, ఆత్మధ్యానమందు స్థిరత్వము కలుగుతుందో వారు శరీరంతో కూడి వున్నా, పరబ్రహ్మ స్వరూపులే!

### పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు

**ఆగస్ట్ 2020**

3 సోమ - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ

11 మంగళ - శ్రీకృష్ణాష్టమి - శ్రీసద్గురుపాదపూజ.

13 గురు - శ్రీగురుదశమి - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

22 శని - వినాయక చవితి - శ్రీసద్గురుపాదపూజ

**సెప్టెంబర్ 2020**

2 బుధ - భాద్రపద పౌర్ణమి - శ్రీ సద్గురుపాదపూజ.

12 శని - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

13-10-1958 : ఈ రోజు నుంచి గుండుగొలనులో దసరా పూజలు భోగిరాజమ్మగారి యింట్లో ప్రారంభమైనాయి. శ్రీ బాబు తమతో బాటు చిరంజీవి రాజుగారిని , రాఘవమ్మగారిని పీటల మీద కూర్చోబెట్టుకుని దీక్ష తీసుకున్నారు. భోగిరాజమ్మగారు దీక్షావస్త్రములను శ్రీ బాబుకు సమర్పించారు.



20-11-1958 : దసరా పూజల అనంతరం శ్రీబాబు కలకత్తా వెళ్ళి యీ రోజే తిరిగి వచ్చారు. శ్రీహరిగారింట్లో ఉన్న కాళీమాత ఫోటోను చూసి ఎవరో భయపడ్డారని చెబితే “కాళీ అంటే అజ్ఞానాన్ని ఖాళీ చేసి, మంచి వాళ్ళనుగా తయారు చేస్తుందే గాని, ఎవరినీ భయపెట్టదు” అన్నారు. ఎవరో తమను “బంగారం వ్యాపారం చేస్తారా?” అని అడిగితే, “అవును. మేము విశ్వబ్రాహ్మలం. విశ్వాన్ని సృష్టించే బ్రహ్మలం” అన్నానని చెప్పారు.

6-1-1959 : శుక్రవారం రాత్రి 11-30 ని॥లకు ఏలూరు వచ్చారు. సుబ్బులు చేత కబీరు చెప్పిన భక్తి సూత్రాలు చదివించి, అర్థం చెప్పారు. కబీరు “గురుదేవుని భగవంతుని కంటె మిన్నగా భావించి పూజించుకోవాలి. గురువు, దైవము ఒకేసారి ఎదుట నిలిస్తే నేను గురుదేవునికే ముందు నమస్కరిస్తాను. ఎందుకంటే మనకు భగవంతుని చూపించే వారు, భగవంతుని వద్దకు చేర్చేవారు గురుదేవులే కదా!” అని గురువు సర్వోత్కృష్టతను వివరించారు.

“సర్వ భారమును గురుదేవుని పైనే ఉంచి ఆయనను ఆశ్రయిస్తే చాలు” అని శ్రీబాబు చెప్పారు. ఇంకా శ్రీబాబు మాట్లాడుతూ “రెండు యిబ్బందుల వలన నేను ఏ పనీ సరిగా చేయలేక పోతున్నాను. మొదటిది, నా ఆరోగ్యం సరిగా లేకపోవటం. డాక్టర్లు పరీక్ష చేసి ఏమీ

లేదంటున్నారు గాని, నాకు ఆరోగ్యం బాగుండటం లేదు. ఇక రెండో కారణం; ఈ ప్రపంచంలో నేను ఎవరి మీద నమ్మకం పెట్టుకున్నానో వారి మనస్తత్వాలు మారిపోతున్నాయి. ఎవరిని నేను బాగు చేయాలనుకున్నానో వాళ్ళే కొంతమంది నన్ను అర్థం చేసుకో లేకపోతున్నారు. ఇదంతా చూస్తుంటే 'ఎందుకు నాకీ తాపత్రయం' అని విరక్తి కలిగి, ఏ హిమాలయాలకో వెళ్ళిపోదామా అనిపిస్తున్నది. నిజమైన భక్తుడు సూర్య చంద్రులు గతులు తప్పినా, సముద్రాలు పొంగినా, కొండలు విరిగి పడినా భగవద్భక్తిని విడువడు.

గురువు అనే చాకలి, శిష్యుడనే బట్టను, జ్ఞానం అనే బండ మీద వేసి ఉతుకుతాడు. వాడిలోని అజ్ఞానమనే కల్మషమంతా హరించి, వాడి మనస్సు శుద్ధ మనస్సుగా మారుతుంది. "ప్రపంచంలో సాధువులెందరో ఉంటారు. కాని నిన్ను ఉద్ధరించ గలిగే అసలైన గురువు ఒక్కడే" అని కబీరుదాసు చెప్పాడు. ఆ ఒక్క గురువునే నమ్మి, విడువక సేవించుకోవాలి. ప్రపంచంలో మహాత్ములు పుట్టటం చాల అరుదుగా ఉంటుంది. అలాగే , వారిని గుర్తించగల శిష్యులు కూడా అరుదుగానే ఉంటారు. ఆరవేసిన పంచెను మడత పెట్టాలంటే కొంగులు కలవవు. అలాగే జీవాత్మ పరమాత్మలూ కలవరు. కష్టపడి పంచె కొంగులను చేర్చి చక్కగా మడత పెట్టిన వాడే నేర్పరి అయిన చాకలి. అలాగే జీవాత్మ పరమాత్మలను అనుసంధానం చేసే మహాత్ముడే సత్య గురువు" అని శ్రీ బాబు చెప్పారు.

-సశేషం

**నీటిలో పడవ వుండవచ్చు, కానీ పడవలో నీరు చేరరాదు. అలాగే నీవు ప్రపంచంలో వుండవచ్చును, కానీ ప్రాపంచిక వాసనలు నీలో వుండరాదు.**

**దేహానికి స్నానం ఎంత అవసరమో, మనస్సునకు ప్రార్థన అంత అవసరం.**

- శ్రీబాబూజీ మహరాజ్




## శ్రీరామానుజులు

-రమణ ప్రసాద్

శ్రీరామానుజులవారి సాంసారిక జీవితం సాఫీగా సాగలేదు. భార్య అనుకూలవతి కాదు. ఒకసారి పెరియనంబి భార్యతో పోట్లాడింది. దానితో పెరియనంబి శ్రీరంగం వెళ్ళిపోయాడు. ఇది తెలిసిన శ్రీరామానుజులు ఎంతో బాధపడ్డారు. ఇంతలో తన కూతుర్ని పంపమని మామగారి వద్దనుండి కబురు వచ్చింది. ఇది అవకాశంగా తీసుకుని భార్యను పుట్టింటికి పంపారు. ఇట్లా ఆయన మార్గంలో అడ్డుగా నిలిచిన అవరోధం తొలిగి పోయింది. శ్రీరామానుజులు సకల బంధాలను ఛేదించి సన్న్యాసాన్ని స్వీకరించారు. ఆయన సన్న్యాసనిష్ఠను చూసిన ప్రజలు ఆయనను "యతిరాజు" అని సంబోధించారు.



అక్కడ శ్రీరంగంలో ఆళ్వందార్ శిష్యులు శ్రీరామానుజుని పీఠాభిషిక్తుని చేయాలని ఆతురత పడుతున్నారు. ఆయనను తీసుకురమ్మని దూతను పంపారు. శ్రీరామానుజుడు భగవంతుడు నిర్దేశించిన కార్యాన్ని నిర్వహించటానికి సిద్ధపడుతున్నాడు. ఆళ్వందార్ శిష్యుడైన తిరుక్కోటియార్ నంబి (గోష్ఠి పూర్ణుడు) ని కలుసుకున్నారు. గోష్ఠి పూర్ణుడు అనే మహాత్ముడు వైష్ణవాలయంలో సేవలు చేసేవాడు. అతడు శూద్రకులంలో జన్మించాడు. గోష్ఠిపూర్ణుల వారి భక్తి ప్రపత్తులు శ్రీరామానుజులవారిని ఆకట్టుకొన్నాయి. ఆయన దగ్గర మంత్ర రహస్యం తెలుసుకోవాలని శ్రీరామానుజుల ఆకాంక్ష. ఎంత కాలానికో గాని తిరుక్కోటియార్ నంబి ప్రసన్నుడుకాలేదు. శిష్యుణ్ణి పరీక్షించిన తరువాత సంతృప్తుడై మంత్ర దీక్ష

ఇవ్వటానికి అంగీకరించాడు. అయితే ఒక ముఖ్య మైన షరతు - ఈ మహామంత్రాన్ని అర్హుడైన వానికి మాత్రమే బోధించాలి.

శ్రీరామనుజులు మంత్రోపదేశం తీసుకున్నారు. "ఈ మంత్రం నన్ను వైకుంఠంలో పెరుమాళ్ళ దగ్గరకు చేర్చితీరుతుంది సందేహం లేదు. కాని ఇంద్రియ వ్యామోహాలకు వశులై ప్రవర్తిస్తున్న జనుల మాట ఏమిటి? నామట్టుకు నేను ముక్తి పొందితే చాలునా? వీరందరినీ ఉద్ధరించవద్దా?" అని తర్కించుకుని శ్రీరామానుజుడు అందరినీ పిలిచి పరమగోప్యము, పావనము అయిన "ఓం నమో నారాయణాయ" అనే మహామంత్రరాజాన్ని ఆలయ గోపురం పై నిలబడి ఎలుగెత్తి అందరికీ ఉపదేశించాడు. ఈ వార్త విని గురువు మండిపడుతూ శిష్యుణ్ణి సంజాయిషి అడిగాడు.

"గురువాజ్ఞ ధిక్కరించినందుకు నన్ను శిక్షించండి." అన్నారు శ్రీరామానుజులు.

"ఇందుకు నరకమే శిక్ష"!

"ఈ మహామంత్ర ప్రభావం వల్ల కోట్లాది మందికి ముక్తి లభిస్తే నేను శాశ్వతంగా నరకానికి పోవటానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు శ్రీరామానుజులవారు. గురువులు సంతోషంతో "వత్సా! నిన్ను నిండు మనస్సుతో ఆశీర్వదిస్తున్నాను. ఇక నుండి వైష్ణవ సిద్ధాంతం "శ్రీరామానుజ దర్శనం" పేరుతో వ్యాప్తి చెందుతుంది." అని దీవించాడు.

శ్రీరామానుజులు "తిరువాయమొళి, "గ్రంథాన్ని, రామాయణాన్ని పెద్దల సన్నిధిలో చక్కగా అధ్యయనం చేసి అందులోని మర్మాలన్నిటినీ గ్రహించారు. అలా శ్రీరామానుజులు తాను ముందు నిర్వహించబోయే దివ్యకార్యానికి నాంది వాక్యం పలికారు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD